సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
ఆదివారం
07-09-2025
పేజీలు: 02


# హైదరాబాదీలకు అలర్ట్..
# సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నీళ్లు బంద్

హైదరాబాద్ మహానగరంలోని ప్రజలకు అధికారులు కీలక అలర్ట్ జారీ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల అంటేసెప్టెంబర్ 9, 10 తేదీల్లో మంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. దీని గురించి తాజాగా హైదరాబాద్ మెట్రోపాలిటిన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ( హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ ) ప్రకటన చేసింది. మరమ్మతు పనులకోసం దాదాపు రెండ్రోజుల పాటు (48 గంటలు) నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. కనుక నగర వాసులు దీన్ని దృష్టిలో పెట్టుకుని.. నీటిని నిల్వ చేసుకోవడంతో పాటుగా.. పొదుపుగా వాడుకోవాలని అధికారులు తెలిపారు. నగరంలో రానున్న మంగళవారం అనగా సెప్టెంబర్ 9న ఉదయం 6 గంటల నుండి మంచి నీటి సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. మళ్లీ 48 గంటల తర్వాతనే అనగా సెప్టెంబర్ 11, గురువారం నాడు తిరిగి నీళ్లు వస్తాయని ప్రకటించారు. 11వ తేదీ ఉదయం 6 గంటల వరకు గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పేజ్-1 మరమ్మతు పనులు కొనసాగుతాయని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ ప్రకటించింది. దీని కిందకు వచ్చే ఏరియాల్లో నీటి సరఫరా ఆగిపోతుందని.. తిరిగి గురువారం ఉదయం ఆరు గంటల తర్వాత నుంచి మంచి నీటి సరఫరా తిరిగి ప్రారంభం అవుతుందని ప్రకటించారు. అయితే మరమ్మతు పనులు చేయడంలో ఆలస్యం అయితే నీటి సరఫరా మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. కాబట్టి నగర వాసులు రానున్న



సోమవారం నాడు అనగా సెప్టెంబర్ 8న ఉదయం వాటర్ వచ్చినప్పుడే ఆ తర్వాత రెండు, మూడు రోజులకు సరిపడా నీటిని పట్టి నిల్వ ఉంచుకోవడం మంచిదంటున్నారు. అలానే సెప్టెంబర్ 9-11వ తేదీ ఉదయం వరకు నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. నగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న గోదావరి పేజ్-1 పథకంలో అధికారులు రిపేరింగ్ పనులు చేపడుతున్నారు. దీని వల్లే నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎస్సార్ నగర్, సనత్ నగర్, బంజారాహిల్స్, సోమాజీగూడ, బోరబండ, బంజారాహిల్స్, ఎర్రగడ్డ, ఎస్పీఆర్ హిల్స్, వెంగళరావు నగర్, యెల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, జుబ్లీహిల్స్, తట్టిఖానా, లాలాపేటలోని కొన్ని ప్రాంతాలతో పాటుగా.. కొండాపూర్, మాదాపూర్‌లోని కొన్ని ప్రాంతాలు, గచ్చిబౌలి, నిజాంపేట, బాచుపల్లితో పాటు మరి కొన్ని ఏరియాల్లో నీటి సరఫరా నిలిచిపోనుంది. అలానే గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఆఫ్‌టేక్స్ పరిధిలోని ఆలేర్, ఘన్‌పూర్ ప్రాంతాల్లో కూడా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని.. కనుక , ఆయా ప్రాంతాల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి.

## రీల్ కాదు.. రియల్ హీరో అనిపించుకున్న బెల్లంకొండ శ్రీనివాస్




టాలీవుడ్ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ ప్రస్తుతం తన కొత్త చిత్రం 'కిష్కింధపురి' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు. ఈ చిత్రాన్ని కౌశిక్ పెగళ్లపాటి డైరెక్ట్ చేయగా పూర్తి హార్రర్ జోనర్‌గా ఈ సినిమాను రూపొందించారు. ఇక ఈ సందర్భంగా తాను కేవలం రీల్ హీరో మాత్రమే కాదని.. రియల్ హీరో అని నిరూపించుకున్నాడు బెల్లంకొండ శ్రీనివాస్. తాజాగా సోషల్ మీడియాలో ఓ అభిమాని తాను అనారోగ్య కారణాల వల్ల చాలా ఇబ్బందుల్లో ఉన్నానని పేర్కొనగా.. దీనికి బెల్లంకొండ శ్రీనివాస్ స్పందించాడు. తాను చిత్ర ప్రమోషన్స్ కోసం విజయవాడ వస్తున్నానని.. అక్కడ ఆ అభిమానిని కలుసుకుని తనకు వీలైనంత సాయం అందిస్తానని బెల్లంకొండ శ్రీనివాస్ అన్నారు. దీంతో నెట్టింట బెల్లంకొండ శ్రీనివాస్‌ను అభిమానులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ఇక కిష్కింధపురి చిత్రంలో అందాల భామ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తోంది.

## కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మించారు



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే భారీగా కమీషన్లు వస్తాయన్న దురాలోచనతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ ప్రాజెక్టును చేపట్టారని, అదే పేదలకు ఇళ్లు కట్టిస్తే కమీషన్లు రావన్న కారణంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కల్వకుంట్ల కుటుంబం వారి పదేళ్ల పాలనలో భారీ అవినీతికి పాల్పడిందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ఈరోజు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లిలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ఆ అప్పులకు తమ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెలా వడ్డీలు కడుతూనే, మరోవైపు సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళుతోందని స్పష్టం చేశారు.

## కళ్లు చెదిరిపోయేలా కీర్తి సురేష్



కీర్తి సురేష్ గతేడాది పెళ్లి చేసుకొని మ్యారేజ్ లైఫ్‌లోకి అడుగుపెట్టింది. ఓవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు పర్సనల్ లైఫ్‌ని కూడా బాగానే బ్యాలెన్స్ చేస్తుంది. పెళ్లి తర్వాత కీర్తి చేసిన సినిమాలు బేబీ జాన్, ఉప్పు కప్పురంబు రిలీజ్ అయ్యాయి. బేబీ జాన్ నిరాశపరచగా.. ఓటీటీలో రిలీజైన ఉప్పు కప్పురంబు ఫర్వాలేదనిపించింది. ఇక తాజాగా సోషల్ మీడియాలో కళ్లు చెదిరిపోయే ఫొటోలు వదిలింది మహానటి. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తీసుకున్న ఫొటోషూట్‌లో కీర్తిని చూసి తెగ కామెంట్లు పెడుతున్నారు ఫ్యాన్స్. చాన్నాళ్లకి మళ్లీ ఇలా గ్లామర్ లుక్‌లో కనిపించిందంటూ ఫ్యాన్స్ అంటున్నారు.



## 333 కిలోల గణేశ్ లడ్డూ.. రూ.99కే దక్కించుకున్న విద్యార్థి

ణపతి నవరాత్రులు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఘనంగా జరుపుకుంటారు భక్తులు. కానీ, ఈ ఉత్సవాల్లో అతి ముఖ్యమైన ఘట్టం మన తెలంగాణ హైదరాబాద్‌లోనే కనిపిస్తుంది. అదేంటంటే_ _ _ఒకటి బడా గణేష్ మహారాజ్, రెండు బాలాపూర్ గణపతి లడ్డూ వేలం_ _ _ అవును.. ఈ రెండు మన హైదరాబాద్ వినాయక ఉత్సవాలకు ప్రపంచ వ్యాప్త గుర్తింపును తెచ్చాయి. బాలాపూర్ వినాయకుడి చేతిలో ఉండే లడ్డూ ఏ యేటికి ఆ యేడు రికార్డులను బద్దలు కొడుతూ భారీ ధర పలుకుతోంది. ఈసారి కూడా అంచనాలను అందుకుంటూ రికార్డు ధర పలికింది. గత ఏడాది రికార్డులను బద్దలు కొడుతూ వేలంలో ఏకంగా 35 లక్షలు ధర పలికింది. నగర శివార్లలోని రిచ్‌మండ్ విల్లాలో గణనాథుడి లడ్డుకు రికార్డు ధర పలికింది. విల్లా సభ్యులు ఏకంగా రూ.2.32 కోట్లకు లడ్డూను దక్కించుకున్నారు. ఇంతటి క్రేజ్ ఉన్న వినాయకుడి చేతిలో ఉండే లడ్డూను ఓ విద్యార్థి కేవలం 99రూపాయలకే దక్కించుకున్నాడు. హైదరాబాద్‌లో గణేశ్ నవరాత్రుల సందడి కొనసాగుతున్న వేళ కొత్తపేటలో ఒక డిగ్రీ విద్యార్థి అదృష్టం అందరినీ ఆశ్చర్యపరిచింది. శ్రీ ఏకదంత యూత్ అసోసియేషన్ నిర్వహించిన లక్కీ డ్రాలో 760 టోకెన్లు విక్రయించగా, బీబీఏ విద్యార్థి సాక్షిత్ గౌడ్ విజేతగా నిలిచాడు. ఒకపక్క కోట్లు, లక్షల రూపాయలకు వేలం వేసే గణేశ్ లడ్డూల వార్తలు వైరల్ అవుతుంటే మరోపక్క కేవలం రూ.99కే 333 కిలోల భారీ లడ్డూ గెలుచుకోవటంతో ఇప్పుడు ఇదే విషయం సోషల్ మీడియాలో ట్రెండింగ్ టాపిక్‌గా మారింది.




## కార్ల ధరలని తగ్గించిన రెనో ఇండియా సంస్థ

ప్రముఖ ఫ్రెంచ్ కార్ల తయారీ సంస్థ రెనో ఇండియా విభాగం శనివారం ఓ తీపి కబురు అందించింది. కొత్తగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ 2.0 విధానం వల్ల కలిగిన పన్ను ప్రయోజనాన్ని పూర్తిగా కస్టమర్లకు బదిలీ చేస్తూ, తన కార్ల ధరలను భారీగా తగ్గించింది. ఈ నిర్ణయంతో రెనో క్విడ్, ట్రైబర్, కైగర్ మోడళ్ల ధరలు రూ. 96,395 వరకు తగ్గాయి. ధరల తగ్గింపు తర్వాత, రెనో క్విడ్ ప్రారంభ ధర రూ. 4,29,900 (ఎక్స్-షోరూమ్) కాగా, కొత్త ట్రైబర్, కైగర్ మోడళ్ల ప్రారంభ ధరలు రూ. 5,76,300 (ఎక్స్-షోరూమ్) గా ఉన్నాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కొత్త ధరలు సెప్టెంబర్ 22వ తేదీ నుంచి జరిగే డెలివరీలకు వర్తిస్తాయని, అయితే సవరించిన ధరలతో బుకింగ్‌లను తక్షణమే అన్ని రెనో డీలర్‌షిప్‌లలో ప్రారంభించినట్లు స్పష్టం చేసింది.ఈ సందర్భంగా రెనో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్రామ్ మామిళ్లపల్లె మాట్లాడుతూ, "జీఎస్టీ 2.0 ప్రయోజనాన్ని పూర్తిగా కస్టమర్లకు అందించడం మా నిబద్ధతకు నిదర్శనం. ఈ నిర్ణయం వల్ల మా కార్లు మరింత అందుబాటులోకి రావడమే కాకుండా, పండుగ సీజన్‌లో డిమాండ్‌ను కూడా పెంచుతుందని మేము విశ్వసిస్తున్నాం" అని తెలిపారు.



## నోట్లో యాసిడ్ పోస్తా.. బీజేపీ ఎమ్మెల్యేకు టీఎంసీ నేత వార్నింగ్

పశ్చిమబెంగాల్ లో ఓ బీజేపీ ఎమ్మెల్యేపై తృణమూల్ కాంగ్రెస్ నేత అబ్దుర్ రహీం చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఓ కార్యక్రమంలో మాల్దా జిల్లా టీఎంసీ అధ్యక్షుడు అబ్దుర్ రహీం బక్షి మాట్లాడుతూ.. బీజేపీ ఎమ్మెల్యే శంకర్ ఘోష్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బెంగాల్ నుంచి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన 30 లక్షల మందిని బంగ్లాదేశీయులు, రోహింగ్యాలుగా అభివర్ణిస్తూ అసెంబ్లీలో శంకర్ ఘోష్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఆయన నోట్లో యాసిడ్ పోసి బూడిద చేస్తానంటూ హెచ్చరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ వాసులను వేధిస్తున్నారని, నిర్బంధ శిబిరాల్లో ఉంచుతున్నారని ఆరోపించారు. బెంగాల్ ప్రజలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్న బీజేపీని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని ప్రజలను కోరారు. అబ్దుర్ రహీం వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. అధికార టీఎంసీ రాష్ట్రంలో హింస, బెదిరింపు సంస్కృతులను పెంచుతోందని ఆరోపించింది. త్వరలో ఎన్నికలు రానుండటంతో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే భయంతో టీఎంసీ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ నేత ఖాగెన్ ముర్ము అన్నారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను నిరోధించడంలో విఫలమైనందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శిరస్సు ఖండించి బల్లపై ఉంచాలంటూ టీఎంసీ ఎంపీ మహువా చేసిన తీవ్ర వ్యాఖ్యలు ఇటీవల దుమారం రేపిన విషయం తెలిసిందే. వివాదాల జోలికి పోవద్దని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సూచించినప్పటికీ.. వరుసగా టీఎంసీ నేతలు తమ వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తుండటం గమనార్హం.

నేటి దినపత్రిక సూర్య EVENING 4PM EDITION
www.suryaa.com



# రైతులకు భారీ శుభవార్త.. ఏకంగా 100% రాయితీ

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు, రైతులకు కూడా ప్రత్యక్ష లాభం చేకూరుతోంది. కరీంనగర్ జిల్లా డీఆర్డీవో ప్రాజెక్టు డైరెక్టర్ రఘువరన్ మాట్లాడుతూ.. అవసరమున్న రైతులు సంబంధిత అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకుంటే పథక ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. ఈ పథకాలకు వంద శాతం రాయితీ కల్పిస్తామన్నారు. జిల్లాలోని 385 పంచాయతీల్లో పశువుల పాకలు, గొర్రెలు-మేకల షెడ్లు, కోళ్ల పెంపకం, అజోలా సాగు, వర్మీ కంపోస్టు గుంతలు, ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాంల నిర్మాణం వంటి అనేక పనులకు లక్ష్యాలు నిర్దేశించారు. ఇప్పటికే అనేక ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా కోళ్ల పెంపకం కోసం వంద షెడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా 34 పనులు కొనసాగుతున్నాయి. ఇంకుడు గుంతలు 2,000 నిర్మాణ లక్ష్యంలో 1,230 పూర్తయ్యాయి. అలాగే.. వర్మీ కంపోస్టు గుంతలు 201లో 112 నిర్మాణ దశలో ఉన్నాయి. పశువుల షెడ్లు 864 లక్ష్యంలో 552 పూర్తయ్యాయి. గొర్రెల షెడ్లు 119లో 74 నిర్మాణ దశలో ఉండగా, అజోలా పెంపకం లక్ష్యం 659 ఉండగా 384 యూనిట్లు ఇప్పటికే రైతుల వద్ద అమలులోకి వచ్చాయి. భూగర్భ జలాల పెంపు కోసం చెక్‌డ్యాంలు 20 నిర్మించాలని నిర్ణయించగా.. వాటిలో 17 ఇప్పటికే పూర్తి అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 'ఊరూరా పనుల జాతర' కార్యక్రమాన్ని ప్రారంభించడం ద్వారా ఈ పనులను వేగవంతం చేసింది. దీనివల్ల స్థానిక కార్మికులకు ఉపాధి లభించడం మాత్రమే కాదు.. రైతుల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడుతున్నాయి. యూనిట్ వారీ వివరాలు.. పశువుల పాకలకు సంబంధించి.. ఒక్క యూనిట్ ధర రూ.98 వేలుగా నిర్ణయించారు. కనీసం మూడు పశువులు ఉన్న రైతులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తారు. గొర్రెలు, మేకల షెడ్లకు సంబంధించి.. ఒక్క యూనిట్ రూ.98 వేలు. కనీసం 10 పశువులు ఉన్న వారికి మంజూరు. కోళ్ల పెంపకం షెడ్లకు సంబంధించి.. ఒక్క యూనిట్ రూ.25 వేలు. రైతులు వంద కోడి పిల్లలను పెంచుకోవాలి. అదనంగా రూ.3 లక్షల వరకు మద్దతు అందజేస్తారు. అజోల్లా పెంపకంలో.. ఒక్క యూనిట్ రూ.20 వేలు. ఇది కేవలం రైతులకు మాత్రమే అందజేయబడుతుంది. వర్మీ కంపోస్టు గుంతల విషయంలో.. ఒక్క యూనిట్ రూ.15 వేలు. వ్యక్తిగతం లేదా సామూహికంగా నిర్మించుకోవచ్చు. ఇంకుడు గుంతల విషయానికి వస్తే.. ఒక్క యూనిట్ రూ.6,500 చొప్పున చెల్లిస్తారు. ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు 100 రోజుల ఉపాధి భరోసా లభిస్తుండగా.. రైతులు తక్కువ ఖర్చుతో పశుసంవర్ధక, కోళ్ల పెంపకం, అజోలా సాగు, వర్మీ కంపోస్టు వంటి కొత్త అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇవి రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం తెచ్చి పెట్టడమే కాకుండా.. గ్రామాల్లో స్థిరమైన జీవన విధానం ఏర్పడేలా చేస్తున్నాయి. ముఖ్యంగా చెక్‌డ్యాంల నిర్మాణం భూగర్భ జలాలను భద్రపరచి సాగుకు సహకరిస్తోంది. ఇలా.. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కేవలం పనులు మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రాంతాలకు స్థిరమైన అభివృద్ధి దిశగా మార్గదర్శిగా నిలుస్తోంది.




# బిగ్ బాస్ 9 గ్రాండ్ లాంచ్ కు రెడీ

బుల్లితెరపై హైయెస్ట్ టీఆర్పీలు కొల్లగొట్టే రియాలిటీ షో 'బిగ్ బాస్ తెలుగు' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. సెప్టెంబర్ 7 (ఆదివారం) సాయంత్రం గ్రాండ్ లాంచ్‌తో 'బిగ్ బాస్ సీజన్ 9' ప్రారంభం కానుంది. ఇప్పటికే హౌస్, హోస్ట్, హంగామా అన్నీ సిద్ధం కాగా.. ఓపెనింగ్ ఎపిసోడ్‌కు ఘాటీ సినీ సెలబ్రిటీలు కూడా హాజరవుతారని సమాచారం. ముఖ్యంగా స్టార్ హీరోయిన్ అనుష్క ప్రత్యేక అతిథిగా షోలో సందడి చేసే అవకాశముంది. ఇప్పటి వరకూ నిర్వాహకులు అధికారికంగా కంటెస్టెంట్ల వివరాలను వెల్లడించకపోయినా, సోషల్ మీడియాలో అనేక గాసిప్‌లు హల్‌చల్ చేస్తున్నాయి.
ఈ క్రమంలో బిగ్ బాస్ మాజీ కంటెస్టెంట్ అయిన ఆది రెడ్డి ఒక వీడియోలో ఈ సీజన్ కంటెస్టెంట్ల లిస్ట్‌ను లీక్ చేశాడు. గత సీజన్లలో కూడా అతని అంచనాలు నిజమవ్వడం విశేషం. అందుకే ఈసారి కూడా అతను చెప్పిన పేర్ల పైన ఆసక్తి పెరిగింది. ఆది రెడ్డి లీక్ చేసిన సెలబ్రిటీ కంటెస్టెంట్లు చూస్తే..
రీతూ చౌదరి (జబర్దస్త్ ఫేమ్)
ఇమ్మాన్యుయేల్ (కమెడియన్)
రాను బొంబాయి కి రాను ఫేమ్ రాము రాథోడ్
తనూజా గౌడ (సీరియల్ నటి)
ఆశా షైనీ (లక్స్ పాప)
భరణి శంకర్ (సీరియల్ విలన్)
సుమన్ శెట్టి (నటుడు)
శ్రష్టి వర్మ (కొరియోగ్రాఫర్)
సంజనా గల్రానీ (నటి)
కామన్ మ్యాన్ కేటగిరీ నుంచి వీరేనా?
ఈసారి కూడా కామన్ మ్యాన్ కేటగిరీ నుంచి ఐదు లేదా ఆరుగురిని సెలెక్ట్ చేసినట్లు సమాచారం. ఆది రెడ్డి తెలిపిన వారి వివరాల ప్రకారం:
మాస్క్ మ్యాన్ హరీశ్
మర్యాద మనీశ్
శ్రీజ
ఆర్మీ పవన్ కళ్యాణ్
ప్రియా
పవన్
వైల్డ్ కార్డ్ ఎంట్రీలు కూడా రెడీ..
ప్రతి సీజన్‌లో మాదిరిగానే ఈసారి కూడా వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఉంటాయంటున్నారు. షో ప్రారంభమైన రెండు వారాల తర్వాత, లేదా దీపావళి పండగ సమయానికి కొత్త కంటెస్టెంట్లు హౌస్‌లోకి అడుగు పెట్టే అవకాశం ఉంది. ఇక ఇదిలా ఉండగా, గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్ కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓపెనింగ్ షోలో వినోదం, డ్యాన్స్, సందడితో ప్రేక్షకులకు పండగ వాతావరణం రానుంది. మరి ఆది రెడ్డి చెప్పిన లిస్ట్ నిజమేనా? లేదా కొత్త సర్ప్రైజ్‌లు ఉంటాయా అన్నది కొన్ని గంటల్లో తేలనుంది.



# హాట్ పోజులతో శ్రద్ధా కపూర్

బాలీవుడ్ నటుడు శక్తీ కపూర్ కుమార్తెగా సినిమాల్లోకి అరంగేట్రం చేసిన శ్రద్ధా కపూర్.. ఆ తర్వాత తనదైన శైలీ సినిమాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. డార్లింగ్ ప్రభాస్ సరసన 'సాహో' సినిమాలో నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. శ్రద్ధా కపూర్ తాజాగా కొన్ని ఫొటోలను షేర్ చేసింది. ఆయన్ని మునుపెన్నడూ చూడని విధంగా అత్యంత శక్తివంతమైన పాత్రలో ఆవిష్కరిస్తూ దర్శకుడు ప్రశాంత్‌నీల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారని అంటున్నారు. ఈ సినిమా ద్వితీయార్ధంలో వచ్చే కీలకమైన పాత్ర కోసం చిత్ర బృందం శ్రద్ధాకపూర్‌ను సంప్రదించినట్లు తెలిసింది. తక్కువ నిడివి కలిగిన అతిథి పాత్రే అయినా కథను మలుపుతిప్పే విధంగా ఉంటుందని అంటున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రవిబస్రూర్ స్వరకర్త. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

# కన్నతండ్రిని చంపి నదిలో పడేశాడు

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో మానవత్వాన్ని మరిచిపోయేలా దారుణం వెలుగులోకి వచ్చింది. కల్వకుర్తి పట్టణంలోని వాసవి నగర్‌కు చెందిన బాలయ్య(70) తన సొంత కుమారుడు బీరయ్య చేతిలో హత్యకు గురయ్యాడు. బీరయ్య ఆస్తి కోసం విచక్షణారహితంగా తండ్రి బాలయ్యపై దాడి చేసి ప్రాణాలు తీశాడు. అంతటితో ఆగక, తండ్రి శవాన్ని కారు డిక్కీలో వేసుకుని చింతపల్లి బ్రిడ్జి వద్ద పడేసాడు. బాలయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు.

## పైసా పైసా కూడబెట్టి చిట్టీలు వేస్తే అసలుకే మోసం..

# రూ.40 కోట్లతో జంప్



అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చీటీల పేరుతో ఘరానా మోసం వెలుగుచూసింది. రూ.40 కోట్లతో చీటీల వ్యాపారి పరారయ్యాడు. ఐ. పోలవరం మండలం మురమళ్ల గ్రామానికి చింతలపూడి వీర శంకరరావు_ _ _ సుమారు 30 సంవత్సరాల క్రితం చిన్న చిన్న చీటీలతో ఈ వ్యాపారాన్ని ప్రారంభించాడు. క్రమంగా వ్యాపారస్తులు, ప్రముఖులతో పరిచయాలు పెంచుకుని ఐదు లక్షల నుంచి కోటి రూపాయల చీటీలను నడపడం మొదలుపెట్టాడు. చుట్టుపక్కల వాళ్లతో స్నేహంగా ఉంటూ చీటీలు కట్టించాడు. దీంతో చాలాకాలంగా ఈ వ్యాపారం నిర్వహించడంతో.. చాలా మంది వీర శంకరరావును నమ్మి చీటీలు వేశారు. అయితే, చీటీ కాలపరిమితి పూర్తయిన వారికి కూడా వడ్డీతో సహా సొమ్మును తిరిగి చెల్లించకుండా అందరినీ మోసం చేశాడు. గత నెల 28వ తేదీన తన భార్య, పిల్లలతో సహా పరారయ్యాడు. బాధితులు డబ్బు కోసం ఇంటికి రాగా తాళం వేసి కనిపించింది. వారం రోజులుగా కనిపించకుండా పోవడంతో మోసపోయిననట్లు గుర్తించారు బాధితులు. ఫోన్లు కూడా స్విచ్ ఆఫ్ అని వస్తుండటంతో లబోదిబోమంటున్నారు. గత కొద్ది నెలలుగా చీటీలు వేసి, తమ డబ్బులు తిరిగి ఇస్తామంటూ నమ్మబలికి, తీరా సమయం వచ్చాక కుటుంబం అంతా డబ్బులతో పరారయ్యారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, పోలీసులను ఆశ్రయించారు. బాధితుల్లో ఎక్కువ మంది రోజువారి కూలీలు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, చిరు వ్యాపారులే ఉన్నారు. రోజు వారీ కూలీ పని చేసి రూపాయి రూపాయి పోగు చేసుకుని చీటీలు కట్టామని, ఇప్పుడు కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా పారిపోయారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# UPI కస్టమర్లకు గుడ్ న్యూస్..

## 24 గంటల్లో రూ.10 లక్షల వరకు లావాదేవీలు..!




డిజిటల్ చెల్లింపులను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి, వేగవంతం చేయడానికి, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మార్పు మూలధన మార్కెట్ పెట్టుబడులు, బీమా ప్రీమియంలు, క్రెడిట్ కార్డ్ బిల్లులు, ప్రయాణం, ప్రభుత్వ చెల్లింపులు వంటి ఎంపిక చేసిన వ్యాపారి వర్గాలకు వర్తిస్తుంది. ప్రతి వర్గానికి వర్తించే విధంగా వివిధ పరిమితులలో నెలవారీ పరిమితి క్యాలెండర్ నెలలో నెలవారీ ప్రాతిపదికన లెక్కించడం జరుగుతుంది. అలాగే P2P (వ్యక్తి నుండి వ్యక్తికి) బదిలీలు రోజుకు రూ.1 లక్ష వద్ద యథావిధిగా ఉంటాయి. ఇక నుంచి UPI ద్వారా 24 గంటల్లో రూ. 10 లక్షల వరకు లావాదేవీలు చేయవచ్చు. ముఖ్యంగా పన్ను చెల్లింపు, ఇతర ఆర్థిక సేవలకు సంబంధించిన వర్గాల కోసం ఈ మార్పు చేసింది. ఈ కొత్త వ్యవస్థ 15 సెప్టెంబర్ 2025 నుండి అమల్లోకి వస్తుంది. ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయడానికి చివరి తేదీని దృష్టిలో ఉంచుకుని NPCI ఈ చర్య తీసుకుంది. తద్వారా పన్ను సంబంధిత చెల్లింపులు మరింత సులభంగా, వేగంగా చేయవచ్చు. ఈ మార్పుతో, NPCI బ్యాంకులకు వారి విధానాలు, భద్రతా ప్రమాణాల ప్రకారం అంతర్గత లావాదేవీ పరిమితులను నిర్ణయించుకునే స్వేచ్ఛను కూడా ఇచ్చింది. అయితే, 24 గంటల గరిష్ట పరిమితి రూ. 10 లక్షలకు మించకుండా చూసుకోవాలి. ఇది బ్యాంకులు కస్టమర్ సౌలభ్యంతో పాటు భద్రతపై దృష్టి పెట్టడానికి అవకాశాన్ని ఇస్తుంది. ధృవీకరించిన వ్యాపారులు, సంస్థలతో లావాదేవీలపై మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుంది. అంటే, ఈ పరిమితి వ్యక్తి నుండి వ్యాపారికి జరిగే లావాదేవీలకు మాత్రమే పెంచడం జరిగింది. మూలధన మార్కెట్, బీమా ప్రీమియం చెల్లింపు, పన్ను డిపాజిట్ వంటి రంగాలలో, ఇప్పుడు లావాదేవీకి పరిమితిని రూ. 5 లక్షలకు పెంచారు. 24 గంటల్లో మొత్తం పరిమితిని రూ. 10 లక్షలకు పెంచారు. గతంలో ఇక్కడ లావాదేవీకి పరిమితి రూ. 2 లక్షల వరకు మాత్రమే ఉండేది.